సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



వెండి వస్తువుల సమర్పణ

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామికి నాగిరెడ్డి మురళీకృష్ణ దంపతులు (పిట్టల వేమవరం) 2.50 కిలోల వెండితో చేయించిన శంఖం, చక్రం, జల్లెడ సమర్పించారు.



రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి చోడే అప్పారావు (కాకినాడ) గురువారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సెహరీ శని (ఉ॥)
రాజమహేంద్రవరం	6.25	4.31
కాకినాడ	6.25	4.32
అమలాపురం	6.25	4.32

న్యూస్‌రీల్

పీఓ, ఏపీఓలకు 15న శిక్షణ

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఎన్నికల నిర్వహణకు నియమించిన ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారుల (ఏపీఓ) ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. తన చాంబర్‌లో ర్యాండమైజేషన్ పూర్తి చేసిన అనంతరం నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో గురువారం ఆమె టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీఓలు, ఏపీఓలు, ఇతర అనుబంధ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందులో భాగంగా ఈ నెల 15న ఆయా నియోజకవర్గాల స్థాయిలో ఉద్యోగులకు తొలి శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని తెలిపారు. రాజమహేంద్రవరం సిటీ సంబంధించి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం రూరల్‌కు కవలగొయ్యిలోని ఫ్యూచర్ కిడ్స్ స్కూల్, అనపర్తికి మార్కండేయపురంలోని ఏఎస్సార్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, రాజానగరానికి బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల, కొవ్వూరుకు దీప్తి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, నిడదవోలుకు వికాస్ డిగ్రీ కళాశాల, గోపాలపురానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో ఈ శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని కలెక్టర్ వివరించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ కూడా పాల్గొన్నారు.

పెన్షన్ తీసుకుని వచ్చి, అస్వస్థతతో దివ్యాంగుడి మృతి



నేకూరి నాగరాజు

నల్లజర్ల: మండలంలోని ప్రకాశరావుపాలెంలో గురువారం పింఛను తీసుకుని వచ్చిన ఓ మానసిక దివ్యాంగుడు అస్వస్థతకు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చినవెంకయ్యకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు నాగరాజు ఉన్నారు. నాగరాజు మానసిక దివ్యాంగుడే కాకుండా కాళ్లు సరిగ్గా లేవు. ఈ పరిస్థితుల్లో పెన్షన్ కోసం సచివాలయానికి బుధవారం ఎండలో మూడుసార్లు తిరిగాడు. సాయంత్రానికి ఎట్టకేలకు పెన్షన్ తీసుకొని ఇంటికి వచ్చిన అతడు తీవ్ర అస్వస్థతకు గురై పడిపోయాడు. ఆ అస్వస్థత నుంచి కోలుకోకుండా గురువారం ప్రాణాలు విడిచాడని మృతుడి సోదరి సరస్వతి తెలిపారు.

జిల్లాలో 89.55 శాతం పింఛన్ల పంపిణీ



కోలమూరు-1లో మంచంపై ఉన్న పేషెంట్‌కు పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని 19 మండలాలు, రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ, కొవ్వూరు, నిడదవోలు మున్సిపాలిటీల పరిధిలో 89.55 శాతం మేర పింఛన్లు పంపిణీ చేశారు. కలెక్టర్ కె.మాధవీలత ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2,43,831 మంది లబ్ధిదారులకు రూ.72.39 కోట్లు మేర పింఛన్లు అందించాల్సి ఉండగా, గురువారం రాత్రి 9 గంటల సమయానికి 2,14,165 మందికి రూ.64.83 కోట్లు పంపిణీ చేశారని వివరించారు. శుక్ర, శని వారాల్లో కూడా పింఛన్ల పంపిణీ కొనసాగుతుందన్నారు. మంచం పట్టిన రోగులు, 40 శాతం పైబడి వైకల్యం ఉన్న దివ్యాంగులకు వారి ఇళ్లవద్దనే సచివాలయ ఉద్యోగులు పింఛన్లు అందజేస్తారని స్పష్టం చేశారు. నిడదవోలు అర్బన్ 94.76 శాతం, నల్లజర్ల 93.12, గోకవరం 91.60 శాతంతో మొదటి మూడు స్థానాల్లో.. కొవ్వూరు రూరల్ 81.07, బిక్కవోలు 83.52, పెరవలి 83.92 శాతం పంపిణీతో చివరి స్థానాల్లో ఉన్నాయని వివరించారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి పంపిణీ ప్రారంభించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ తెలిపారు.

కవి నల్లాకు అసోసియేషన్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం



నరసింహమూర్తి

అమలాపురం టౌన్: నడక కవి, శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి పేరు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమి బుక్ ఆఫ్ రికార్డ్‌లో నమోదైంది. ఈ మేరకు ఆ బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ చీఫ్ ఎడిటర్ కె.ఉష నుంచి జాతీయ స్థాయి గుర్తింపు ప్రశంసా పత్రాన్ని ఆయన ఆన్‌లైన్ ద్వారా గురువారం అందుకున్నారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో నడక కవిత్వానికి నరసింహమూర్తి 25 ఏళ్లుగా సేవ చేస్తున్నారు. 103 నడక నానీల పుస్తకాలను రచించిన అమలాపురానికి చెందిన ఆయన ప్రజలకు ఉచితంగా వాటిని పంపిణీ చేస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అన్నారు. శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, వాకర్స్ అంతర్జాతీయ ఏరియా కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి ఆయనకు అభినందనలు తెలిపారు.

ఇంటి నుంచే ఓటు

- 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం
- మొబైల్ ఓటింగ్ వాహనంతో హోం ఓటింగ్ సౌకర్యం
- ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- 22వ తేదీ వరకూ గడువు
- అవగాహన కల్పిస్తున్న అధికార యంత్రాంగం



అనపర్తిలో స్వీప్ కార్యక్రమం చేపట్టిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, అనపర్తి ఆర్‌ఓ మాధురి తదితరులు



కడియంలో వృద్ధురాలికి ఫారం-12డి అందిస్తున్న జేసీ, రూరల్ ఆర్‌ఓ తేజ్‌భరత్ తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): గతంతో పోలిస్తే రానున్న ఎన్నికల్లో పోలింగ్ శాతం మరింతగా పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఈసారి వినూత్న చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలోని శాసనసభ, లోక్‌సభ స్థానాలకు మే 13న ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించారు. ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటర్లలో చైతన్యం పెంచేందుకు సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే తొలిసారిగా ఇంటి నుంచే ఓటు వేసే (హోం ఓటింగ్) అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది.

హోం ఓటింగ్ ఇలా..

- పోలింగ్ కేంద్రాలకు రాలేని స్థితిలో ఉన్న 40 శాతం మించి వైకల్యం ఉన్న దివ్యాంగులకు, 85 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధులకు హోం ఓటింగ్ అవకాశం కల్పిస్తున్నారు.
- దీనికి పోస్టల్ బ్యాలెట్ తరహాలోనే ముందుగా దరఖాస్తు చేసుకోవాలి.
- ఇంటి నుంచే ఓటు వేయడానికి అర్హులైన వారిని బూత్ లెవెల్ అధికారి (బీఎల్‌ఓ) కూడా సంప్రదించి, వారి ఆసక్తికి అనుగుణంగా దరఖాస్తు చేయిస్తారు.
- జిల్లాలో ఇప్పటికే ఈ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను చాలా వరకూ పూర్తి చేశారు.
- ఈ నెల 22వ తేదీ వరకూ దరఖాస్తులకు గడువు ఇచ్చారు. ఆ తర్వాత ఎవరైనా సరే పోలింగ్ బూత్ వద్దకు వెళ్లి, ఓటు వేయాల్సి ఉంటుంది.
- హోం ఓటింగ్ కావాలనుకునే వారు ముందుగా ఫారం-12డి ద్వారా ఈఆర్‌ఓకి దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలన అనంతరం అర్హులైన వారి జాబితాను ఈఆర్‌ఓ స్థాయిలో రూపొందిస్తారు.
- అర్హులైన ఓటర్లకు ఏ రోజు ఓటు వేయాలో అధికారులు ముందుగానే సమాచారం ఇస్తారు.
- మొబైల్ ఓటింగ్ వాహనం ద్వారా ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని వారికి కల్పిస్తారు.
- బ్యాలెట్ పేపర్‌పై రహస్యంగా ఓటు వేసేలా ఏర్పాటు చేస్తారు.
- ఈ ప్రక్రియ అంతా వీడియో తీస్తారు.
- ఆ ఓటును సీల్ చేసిన అనంతరం సంబంధిత తహసీల్దార్ కార్యాలయం ద్వారా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తరలిస్తారు.
- ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేయగా, ఈ ఎన్నికల నుంచి మన రాష్ట్రంలో కూడా అమలు చేస్తున్నారు.
- పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసేందుకు దివ్యాంగులు, వృద్ధులు గతంలో నానా ఇబ్బందులూ పడేవారు. తాజా నిర్ణయంతో వీరికి ఈ కష్టాలు తొలగనున్నాయి.
- హోం ఓటింగ్ కోసం మొబైల్ ఓటింగ్ వాహనాలను అధికారులు ఇప్పటికే సిద్ధం చేస్తున్నారు.

ముమ్మరంగా స్వీప్

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు ప్రతి మండలంలోనూ అధికారులు ఓటర్ల నమోదు కార్యక్రమాలు చేపట్టారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్వీప్ కార్యక్రమం ద్వారా గురువారం నాటికి 40,509 మంది ఓటర్లు కొత్తగా నమోదు చేసుకున్నారు. కొత్తగా ఓటు కోసం ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోవాలనుకున్నా, చిరునామాలో మార్పులు చేసుకోవాలనుకున్నా ఈ నెల 14వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. కొత్త ఓటు కోసం ఓటరు హెల్ప్‌లైన్ యాప్, వీఓటీఈఆర్ఎస్.ఈసీఐ.జీఓవీ.ఇన్, సీఈఓఏపీఎన్‌డీహెచ్ఆర్‌ఏ.ఎన్ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్‌ల ద్వారా ఫారం-6లో దరఖాస్తు చేయాలి. అలాగే చిరునామా మార్పు, ఓటు బదిలీ కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తులను పది రోజుల్లో పరిశీలించి, అర్హత ఉంటే ఓటర్ల జాబితాలో చేరుస్తారు. తద్వారా వీరికి మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లభిస్తుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారి పేర్లను అనుబంధ జాబితా ద్వారా, అలాగే చనిపోయిన, ఆబ్సెంటీ, బదిలీ ఓటర్ల వివరాలను ఏఎస్‌డీ జాబితాలో నమోదు చేసి, ఆయా పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్ అధికారులకు అందజేస్తారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి నియోజకవర్గంలో స్వీప్ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టి, ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు

అసెంబ్లీ నియోజకవర్గాలు	: 7
మొత్తం ఓటర్లు:	16,13,579
ఇప్పటి వరకూ హోం ఓటింగ్ పొందిన దివ్యాంగ ఓటర్లు	: 19,690
హోం ఓటింగ్ పొందిన 85 ఏళ్లు పైబడిన వారు	: 8,281
వీరిలో పురుషులు	: 3,534
మహిళలు	: 4,747

నియోజకవర్గాల వారీగా 85 ఏళ్లు పైబడిన ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	మొత్తం
అనపర్తి	442	707	1,149
రాజానగరం	404	672	1,076
రాజమహేంద్రవరం సిటీ	848	965	1,813
రాజమహేంద్రవరం రూరల్	629	717	1,346
కొవ్వూరు	231	352	583
నిడదవోలు	468	616	1,084
గోపాలపురం	512	718	1,230

ఇంటి వద్దనే ఓటు వేసేలా చర్యలు



దివ్యాంగులు, 85 సంవత్సరాల దాటిన వయోవృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న వారు, అనారోగ్యంతో మంచానికే పరిమితమైన కొంత మంది ఓటు హక్కు వినియోగించుకోలేకపోతున్నారు. అటువంటి వారు ఇంటి వద్దనే ఓటు వేసేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. అర్హత కలిగిన వారు ఫారం-12డి ద్వారా బీఎల్‌ఓలకు దరఖాస్తులు అందించాలి.

– కె.మాధవీలత, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

అందరి కృషితో ప్రగతి పథంలో జిల్లా



కలెక్టర్ మాధవీలతను సత్కరిస్తున్న జేసీ తేజ్‌భరత్ తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): కొత్త జిల్లా ఏర్పడి రెండేళ్లు పూర్తయ్యిందని, ఈ కాలంలో జిల్లాను అధికారులు, సిబ్బంది తోడ్పాటుతో ప్రగతి పథంలో నడిపించామని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. జిల్లా ఏర్పడి మూడో సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, రెండేళ్లుగా తనతో పాటు కలసి పని చేసిన అధికారులు, సిబ్బంది తోడ్పాటు, సమన్వయంతో జిల్లాకు మంచి గుర్తింపు తీసుకుని వచ్చామని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, జిల్లాలో చేపట్టిన ఇతర పనులు విజయవంతం కావడమే దీనికి నిదర్శనమన్నారు. కొత్తగా జిల్లా ఏర్పడినప్పుడు మౌలిక సదుపాయాలు, వనరులు తదితర సమస్యలున్నా, దశల వారీగా అధిగమిస్తూ చక్కటి ఫలితాలు సాధించామని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో కూడా సమన్వయం అత్యంత కీలకమని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ మాట్లాడుతూ, కలెక్టర్ మాధవీలత మార్గదర్శకత్వంతో జిల్లాను ప్రగతి పథంలో నడిపించగలుగుతున్నామని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు, జిల్లాలో బంగారు కొండ అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టి, ఫలితాలు సాధించామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

డెల్టాలకు 5,800 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 5,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 1,250, పశ్చిమ డెల్టాకు 2,950 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 5.95 అడుగులుగా నమోదైంది.

జిల్లా జడ్జిల బదిలీ

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలువురు జిల్లా జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావును కడప జిల్లా ఒకటో అదనపు జిల్లా జడ్జిగా నియమించారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా ఒకటో అదనపు జిల్లా జడ్జిగా పని చేస్తున్న కె.శ్రీదేవిని నియమించారు. రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు కం 10వ అదనపు జిల్లా జడ్జి ఎం.నాగేశ్వరరావును విశాఖపట్నం నాలుగో అదనపు జిల్లా కోర్టుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో గుంటూరు జిల్లా మంగళగిరిలోని రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీలో పని చేస్తున్న ఆర్.శ్రీలత నియమితులయ్యారు. రాజమహేంద్రవరం ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి యాయా ప్రసాద్ విశాఖపట్నం ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుంటూరు ఫ్యామిలీ కోర్టు కం 12వ అదనపు జిల్లా జడ్జి పీవీఎస్ సూర్యనారాయణమూర్తిని నియమించారు. ప్రకాశం జిల్లా ఒకటో అదనపు జిల్లా జడ్జి ఆర్.శివకుమార్‌ను రాజమహేంద్రవరం ఒకటో అదనపు జిల్లా జడ్జి కోర్టుకు బదిలీ చేశారు.

చంద్రబాబు నిర్లక్ష్యంతోనే కోటిపల్లి రైల్వే లైన్ ఆలస్యం

- భూసేకరణకు రాష్ట్ర వాటా రూ.50 కోట్లు మంజూరు
- నాలుగేళ్లలో రూ.1,409 కోట్లు మంజూరు
- ఎంపీ చింతా అనురాధ



ఎంపీ అనురాధ

అల్లవరం: రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు కోటిపల్లి -నరసాపురం రైల్వే లైన్ నిర్మాణంపై నిర్లక్ష్యం వహించారని, లోక్‌సభలో టీడీపీ ఎంపీలు కోటిపల్లి రైల్వే లైన్ ఆవశ్యకతను వివరించి నిధులు తేవడంలో విఫలమయ్యారని అమలాపురం ఎంపీ చింతా అనురాధ తెలిపారు. అల్లవరం మండలం మొగళ్ళమూరులోని ఆమె నివాసంలో కోటిపల్లి రైల్వేలైన్ పురోగతిపై గురువారం ఎంపీ అనురాధ మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు రూ.1,409 కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. కోటిపల్లి-శానపల్లిలంక, బోడసకుర్రు- పాశర్లపూడి, చించినాడ-నరసాపురం నదులపై రైల్వే లైన్ వంతెనలు పిల్లర్లు నిర్మాణంలో చివరి దశలో ఉన్నాయన్నారు. నదులపై నిర్మాణంలో ఉన్న వంతెనలకు గడ్డర్ల ఏర్పాటుకు రైల్వే శాఖ టెండర్ల ప్రక్రియను పూర్తి చేసిందని, త్వరలో పనులు ప్రారంభించనున్నారని తెలిపారు. అమలాపురం నుంచి చించినాడ వరకు రైల్వే లైన్ భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వ వాటాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవలే రూ.50 కోట్లు విడుదల చేశారని ఎంపీ అన్నారు. రాష్ట్ర వాటాగా ఒక రూపాయి కుడా ఎందుకు విడుదల చేయలేకపోయారో చంద్రబాబు, ఆయన ఎంపీలు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విడుదల చేసిన రూ.50 కోట్ల నిధులతో భూసేకరణ వేగవంతమైందని తెలిపారు. రైల్వే లైన్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నారని, కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించడంలో కీలక భూమిక పోషిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తాను ఎంపీగా పార్లమెంట్‌లో కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ ప్రాముఖ్యతను వివరిస్తూ అధిక నిధులు కేటాయింపులు చేయించానన్నారు. తాను ఎంపీగా మొత్తంగా రూ.1,409 కోట్లు రైల్వే లైన్ నిర్మాణం కోసం నిధుల కేటాయింపులు జరిగాయన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కోటిపల్లి-నరసాపురం రైల్వే ప్రాజెక్టుకు రూ.300 కోట్లు, కాకినాడ నుంచి కోటిపల్లి వరకు రైల్వే ట్రాక్ మరమ్మతులకు రూ.10 కోట్లు, భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.50 కోట్లు విడుదల చేస్తే కోటిపల్లి రైల్వే లైన్‌పై చంద్రబాబు విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా నిజాలు తెలుసుకొని, కోటిపల్లి రైల్వే లైన్‌పై చంద్రబాబు రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. మే 13 న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణా స్వీకారం చేస్తారని, సీఎం జగన్ నేతృత్వంలోనే కోటిపల్లి-నరసాపురం రైలు పట్టాలు ఎక్కుతుందని, కోనసీమ జిల్లా ప్రజల చిరకాల కోరిక తీరుతుందని ఎంపీ అనురాధ అన్నారు.

మతి భ్రమించి మాట్లాడుతున్నారా?

చంద్రబాబుపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు బుధవారం ద్రాక్షారామలో తన గురించి చేసిన వ్యాఖ్యలపై శాసనమండలి సభ్యుడు, మండపేట అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండపేట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు తనను ఉద్దేశించి దళితులకు శిరోముండనం చేసిన వ్యక్తి పక్క నియోజకవర్గానికి వెళ్లిపోయారని తనపై పరోక్షంగా చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. తొలుత నీవు కాంగ్రెస్ హయాంలో చంద్రగిరి నుంచి పోటీ చేయలేదా అని ప్రశ్నించారు. మీ కుమారుడు లోకేష్ మంగళగిరి నుంచి పోటీ చేయలేదా అని ప్రశ్నించారు. వృద్ధుడైన చంద్రబాబు మతిమరుపుతో అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని అన్నారు. శిరోముండనం చేసి ఉంటే తనను పార్టీలోకి ఆహ్వానించి నాలుగుసార్లు ఎందుకు టికెట్ ఇచ్చారని ప్రశ్నించారు. 'శిరోముండనానికి సంబంధించిన విషయాలు మీకు తెలియవా? ఆనాడు మీరే అధికారంలో ఉన్నారు. ఆ విషయాన్ని మీ విజ్ఞతకే వదిలివేస్తున్నాను. ఇంకా ముందుకు వెళ్లడం లేద'ని త్రిమూర్తులు అన్నారు. తాను బయటి నుంచి వచ్చి మండపేటలో పోటీ చేస్తున్నానన్నారని, రామచంద్రపురంలో మీరు టికెట్ ఇచ్చిన అభ్యర్థి ఎక్కడి నుంచి వచ్చారో మీకు గుర్తు లేదా అని ఎద్దేవా చేశారు. తాను టీడీపీకి రాజీనామా చేసి బయటకు వచ్చాక ఇప్పటివరకు రామచంద్రపురంలో ఆ పార్టీకి జెండా కట్టే నాథుడు లేకపోయారని ఆయన అన్నారు. పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను 1994 లోనే ప్రజల కోరిక మేరకు ఇండిపెండెంట్‌గా గెలిచానని బహుశా ఆ విషయం చంద్రబాబు మర్చిపోయి ఉండవచ్చునన్నారు. 2014లో మోదీతో జత కట్టిన మీరు ఆనాడు కేంద్రతో ఉండి నరసాపురం రైల్వేలైనును ఎందుకు సాధించలేదని ప్రశ్నించారు. సీఎం జగన్ సింగిల్‌గా ఎన్నికల బరిలోకి వస్తుంటే వంచకుడని అవినీతిపరుడని విమర్శిస్తున్నారని, అటువంటప్పుడు మీరొక్కరే సింగిల్‌గా ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు.

ప్రతిభకు గేట్ తెరిచారు



- జేఎన్‌టీయూకే విద్యార్థుల ప్రతిభ
- ఈ ఏడాది 189 మందికి ఉత్తమ ర్యాంకులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అవకాశం వస్తే కార్పొరేట్ విద్యార్థుల కన్నా తామేమీ తక్కువ కాదని నిరూపించారు జేఎన్‌టీయూకే విద్యార్థులు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ తమ ప్రతిభకు 'గేట్' తెరిచారు. గత ఫిబ్రవరిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బెంగళూరు నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్)-2024లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వర్సిటీలో అనుభవజ్ఞులైన ప్రతి ప్రొఫెసర్‌కూ ఆయా విభాగాల సబ్జెక్టుల బోధనపై క్యాలెండర్ రూపొందించి, పక్కాగా అమలు చేశారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని గేట్‌లో మంచి ర్యాంకులు సాధించారు. గత మూడేళ్ల కంటే అత్యుత్తమ ప్రతిభ చూపారు. ఈసీఈ విభాగానికి చెందిన యర్రు లక్ష్మీసాయికృష్ణ ఆలిండియా 10వ ర్యాంక్ సాధించాడు. సివిల్ విభాగం నుంచి 30 మంది, ఈఈఈ విభాగం నుంచి 65, సీఎస్ఈ నుంచి 25, కెమికల్ విభాగం నుంచి 8, పెట్రోలియం ఇంజనీరింగ్ నుంచి 6 చొప్పున విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. కోవిడ్ కారణంగా 2021లో విద్యార్థులకు రెగ్యులర్ తరగతులు లేకపోవడంతో ఉన్నత విద్యామండలి ఆ ఏడాది ఆన్‌లైన్‌లో గేట్ తరగతులు నిర్వహించగా, 21మంది విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులు సాధించారు.

2022లో 38 మంది, 2023లో 45 మంది ర్యాంకులు సాధించగా.. ఈ ఏడాది 189 మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి, విజయబావుటా ఎగురవేశారు. గేట్‌లో ర్యాంకులు సాధించిన వారికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఆయా విద్యా సంస్థల్లో ఎంటెక్ చదివే వారికి ప్రతి నెలా రూ.12,400 చొప్పున ఉపకార వేతనం అందిస్తారు.

మంచి ర్యాంకులు సాధిస్తున్నారు



ఇంజినీరింగ్ పూర్తి చేస్తున్న విద్యార్థులకు కీలకంగా ఉన్న గేట్ పరీక్షలో మా విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉంది. గేట్ శిక్షణ తరగతులను ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకుని, మంచి ర్యాంకులు సాధించి, వర్సిటీ ప్రతిష్ట నిలిపారు. గేట్ స్కోర్ ఆధారంగా ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలతో పాటు ఆసియా దేశాల్లో ఎంఎస్, పీహెచ్‌డీ చేయవచ్చు. ఈ ర్యాంకు ఆధారంగా సింగపూర్‌లోని ప్రముఖ వర్సిటీలు సీట్లు ఇస్తున్నాయి.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు, ఉప కులపతి, జేఎన్‌టీయూకే


ఐఐటీలో ఎంటెక్ చదువుతా..



గేట్‌లో 10వ ర్యాంక్ రావడం చాలా సంతోషంగా ఉంది. బీటెక్‌లో 9.32 పాయింట్లతో ఉత్తీర్ణత సాధించి గేట్ పరీక్షకు సిద్ధమయ్యాను. ఐఐటీ ముంబైలో ఎంటెక్ తరువాత సెమీ కండక్టర్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఉన్నత స్థాయికి చేరుకోవడమే నా లక్ష్యం.

– వై.లక్ష్మీసాయికృష్ణ, గేట్ 10వ ర్యాంకర్

సెకండియర్ నుంచే అవగాహన



ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం నుంచే గేట్ పరీక్షపై అవగాహన కల్పిస్తాం. పాత పేపర్ల రివిజన్‌తో పాటు ప్రత్యేకంగా బోధిస్తాం. విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల స్థాయిని మరింత పెంచారు. ఈ ఏడాది మరింత ప్రతిభ చూపడం సంతోషంగా ఉంది.

– డాక్టర్ కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్, జేఎన్‌టీయూకే

పరిశోధన రంగంపై ఆసక్తి



ఆలిండియా స్థాయి ఓపెన్ కేటగిరిలో 118వ ర్యాంక్ సాధించడం చాలా సంతోషంగా ఉంది. ప్రస్తుతం కేంద్ర పరిశోధన సంస్థలో ఉద్యోగం చేస్తున్నాను. ఎంటెక్ చదివి పరిశోధన రంగంలో అగ్రస్థానంలో నిలవడమే నా ఆశయం.

– మీసాల సాయి దుర్గా కౌశిక్, 118వ ర్యాంక్

రత్నగిరికి పోటెత్తిన భక్తులు



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న నవదంపతులు, భక్తులు

అన్నవరం: రత్నగిరికి గురువారం భక్తులు పోటెత్తారు. బుధవారం రాత్రి, గురువారం ఉదయం రత్నగిరిపై 50కి పైగా వివాహాలు జరిగాయి. ఇవే ముహూర్తాల్లో వివిధ ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న వారు కూడా స్వామివారి ఆలయానికి తరలివచ్చారు. వీరందరూ వ్రతాలాచరించి సత్యదేవుని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం, క్యూ లైన్లు, వ్రత, విశ్రాంత మండపాలు నవ దంపతులు, వారి బంధుమిత్రులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 40 వేల మంది స్వామివారిని దర్శించి, పూజలు చేశారని అధికారులు తెలిపారు. వ్రతాలు రెండు వేలు జరిగాయి. ఉచిత దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుడు నిజరూపంలో దర్శనమిచ్చారు.

క్లుప్తంగా

రూ.1.75 లక్షల స్వాధీనం



కాండ్రేగులలో నగదు స్వాధీనం చేసుకుంటున్న సత్యనారాయణరెడ్డి తదితరులు

పెదపూడి: సంపర గ్రామం నుంచి కాకినాడ వెళుతున్న ఎంఏరాజు అనే వ్యక్తి కారులో రూ.1.75 లక్షల నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు మండల ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ అధికారి ఎం.సత్యనారాయణరెడ్డి తెలిపారు. గురువారం కాండ్రేగుల గ్రామ శివారు పోతురాజు గుడి వద్ద వాహనాల తనిఖీ చేపట్టగా ఈ నగదు పట్టుబడిందన్నారు. ఆ నగదుకు సంబంధించి అవసరమైన పత్రాలు, వివరాలు లేనందున వీఆర్వో హరిచంద్రప్రసాద్ రిపోర్టు ఆధారంగా నగదు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయితో రైల్వే పోలీసులు

తుని: గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని స్థానిక రైల్వే స్టేషన్‌లో అరెస్ట్ చేశామని తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై తనిఖీలు నిర్వహిస్తుండగా విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌లో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని పట్టుకుని ప్రశ్నించామన్నారు. బ్యాగులు తనిఖీ చేసి 18 కిలోల 390 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ రూ.92 వేలు ఉంటుందన్నారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా చెల్లగడ్డకు చెందిన సంజిత్ లిమ్మాను అదుపులోకి తీసుకున్నారు. సికింద్రాబాద్‌లో గంజాయిని అమ్మకోవడానికి తీసుకువెళ్తుండగా తుని వచ్చే సరికి ఆవతల వ్యక్తి ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో వేరే వ్యక్తికి ఇవ్వడానికి తుని స్టేషన్‌లో దిగినట్టు నిందితుడు సంజిత్ లిమ్మా చెప్పాడన్నారు. ఆర్‌పీఎఫ్ ఏఎస్సై గోవిందరావు, జీఆర్పీ సిబ్బంది పి.శ్రీనివాసరావు, మోహనరావు, ప్రసాదరావు, రామకోటి, గణేష్, శంకర్రావుతో కలిసి నిందితుడు సంజిత్ లిమ్మాను అరెస్ట్ చేసి విజయవాడ రైల్వే కోర్టుకు తరలించామన్నారు.

ఈ శ్రమ్‌తో భరోసా

- ఐదేళ్ల వరకు 'ఈశ్రమ్' కార్డుకు గడువు
- 60 ఏళ్లు దాటితే చెల్లుబాటు కాని కార్డు



రోడ్డు పనులు చేస్తున్న కూలీలు

రాయవరం: కార్మికుల సంక్షేమానికి కేంద్ర కార్మిక ఉపాధి శాఖ 'ఈశ్రమ్' పోర్టల్ ప్రారంభించింది. ఆధార్ కార్డు ద్వారా అసంఘటిత రంగ కార్మికులు తమ వివరాలను పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. నమోదు చేసుకున్న రోజు నుంచి ఐదేళ్లపాటు ఈ కార్డు అమల్లో ఉంటుంది. ఆ తర్వాత రెన్యువల్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. 16 నుంచి 59 సంవత్సరాల లోపు ఉన్న స్త్రీ, పురుషులకు మాత్రమే ఇది వర్తిస్తుంది. కోనసీమ జిల్లాలోని 22 మండలాల పరిధిలో 2021 ఆగస్టు 21 నుంచి నేటి వరకు 1,10,115 మంది కార్మికులు ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని, కార్డును పొందారు.

ప్రయోజనాలు ఇవీ..

మహిళా కార్మికురాలి వివాహానికి, అలాగే కార్మికుల ఇద్దరు కుమార్తెల వివాహానికి ఒక్కొక్కరికి రూ.30వేలు కానుకగా ఇస్తారు. ప్రసూతి సమయంలో మహిళా కార్మికులకు, కార్మికుడి భార్యకు, కార్మికుల ఇద్దరు కుమార్తెలకు ఒక్కొక్కరికి రూ.30 వేలు అందజేస్తారు. ప్రమాదవశాత్తూ కార్మికుడు మరణిస్తే, మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు రూ.6 లక్షలు, అంత్యక్రియల నిమిత్తం రూ.30 వేలు వెంటనే అందజేస్తారు. సహజంగా మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు రూ.ఒక లక్ష, అంత్యక్రియల నిమిత్తం రూ.30వేలు, ప్రమాదంలో గాయపడి ప్రమాదవశాత్తు పూర్తి శాశ్వత అంగ వైకల్యం కలిగిన వారికి రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందుతుంది. ప్రమాదవశాత్తు పాక్షిక శాశ్వత అంగ వైకల్యం కలిగిన వారికి రూ.4 లక్షలు అందజేస్తారు. ఎంప్లాయిస్ కాంపెన్సేషన్ యాక్ట్ ప్రకారం అంగవైకల్య శాతాన్ని బట్టి ఆర్థిక శాతం అందజేస్తారు. కార్మికులకు ప్రమాదం లేదా అనారోగ్యం వల్ల తాత్కాలిక అసక్తత కలిగి చికిత్స నిమిత్తం ఐదు రోజులు, ఆపై ఆసుపత్రిలో చేరిన వారికి రోజుకు రూ.300 వంతున, నెలకు రూ.4,500 ఆ పై నుంచి మూడు నెలల్లో లోపు వారికి 13,500 అందజేస్తారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి ఇలా

'ఈశ్రమ్' పోర్టల్ లో నమోదు చేసుకోవడానికి ఈశ్రమ్.జీవోవీ.ఇన్ అధికారిక వెబ్సైట్‌కి లాగిన్ అవ్వాలి. లింకు ఓపెన్ చేయగానే ఆధార్ కార్డ్ అప్లోడ్ చేయగా మొబైల్ నెంబర్ కు ఓటిపి వస్తుంది. కేప్చా కోడ్ ఎంటర్ చే సిన తర్వాత వేలిముద్ర ద్వారా నమోదు చేయాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ తర్వాత కార్మికులకు ప్రత్యేకమైన యూనివర్సల్ అకౌంట్ నెంబర్‌తో కూడిన ఈశ్రమ్ కార్డు జారీ అవుతుంది. ఈ కార్డు ద్వారా ఎప్పుడైనా..ఎక్కడైనా వివిధ సామాజిక భద్రతా పథకాలను పథకాల ప్రయోజనాలను పొందవచ్చు సంక్షోభ సమయాల్లో కార్మికులు అనేక ప్రయోజనకరమైన పథకాలకు కూడా అర్హులవుతారు. 16 నుంచి 59 ఏళ్ల స్త్రీ పురుషులు ఈశ్రమ్ కార్డు పొందడానికి అర్హులు.



విజేతగా నిలిచిన మహారాష్ట్ర టీమ్

ముగిసిన ప్రో–కార్ట్ రేసింగ్ పోటీలు

విజేత మహారాష్ట్ర టీమ్, రన్నర్‌గా రఘు కళాశాల

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో నాలుగు రోజులపాటు జరిగిన జాతీయస్థాయి ప్రో–కార్ట్ రేసింగ్ సీజన్–4 పోటీలు గురువారంతో ముగిసినట్టు కళాశాలల వైస్ చైర్మన్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. కర్ణాటక, తెలంగాణ, చెన్నై, తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన 13 టీమ్‌లకు గాను 350 మంది పాల్గొని తమ ప్రతిభను కనబరిచినట్టు పేర్కొన్నారు. నాలుగో రోజు గురువారం జరిగిన పోటీలలో విజేతగా మహారాష్ట్రకు చెందిన పీవీడీపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ట్రోజన్) టీమ్ నిలవడంతో రూ.1,00,000 నగదు, విశాఖకు చెందిన రఘు ఇంజినీరింగ్ కళాశాల (ఎనిగ్మా) టీమ్ రన్నరప్‌గా నిలిచి రూ. 50,000 నగదు బహుమతిని గెలుపొందినట్టు తెలిపారు. ఇవే టీమ్‌లు ఎండు రెన్స్ విన్నర్ పీవీడీపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూ.85,000, ఎండు రెన్స్ రన్నర్ రఘు ఇంజినీరింగ్ కళాశాల రూ.50,000 నగదు గెలుపొందినట్టు తెలిపారు. వివిధ అంశాలలో పాయింట్ల ఆధారంగా నగదు బహుమతులతో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్స్ ఎం శ్రీనివాస్‌రెడ్డి, డోలా సంజయ్, ఆదిరెడ్డి రమేష్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు శరవణన్, భీమేష్ రెడ్డి పాల్గొన్నారు.



రేసింగ్ దృశ్యం

రెప్పపాటు ఖరీదు రెండు ప్రాణాలు



క్రేన్ సహాయంతో కారును బయటకు లాగుతున్న దృశ్యం

- ఆగి ఉన్న లారీని ఢీ కొన్న కారు
- లారీ నిలిచిన రెండు నిమిషాలకే ప్రమాదం
- లారీ కిందకు దూసుకుపోయిన కారు
- కారు ముందుభాగంలో ఇరుక్కున్న మృతదేహాలు



కుటుంబ సభ్యులతో మృతుడు సుబ్రహ్మణ్యం (ఫైల్)



మృతుడు పల్లయ్య చౌదరి (ఫైల్)



కొడుకు, మేనల్లుడు మృతదేహాలను చూసి రోదిస్తున్న సుబ్రహ్మణ్యం తల్లి వరలక్ష్మి

గండేపల్లి: అసలే హైవే.. ఆపై వేగం... వీటికితోడు నిద్రతో కళ్లు మూతపడడంతో రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. లారీ నిలిచిన రెండు నిమిషాలకే మృత్యువు ఇద్దరిని బలి తీసుకుంది. జగ్గంపేట సీఐ ఎస్. లక్ష్మణరావు వివరాల మేరకు హనుమాన్ జంక్షన్‌లో నివాసం ఉంటూ రొయ్యల ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్న ఆచంట సమీపంలోని కొడమంచలికి చెందిన తమ్మిన సుబ్రహ్మణ్యం (42), అతని మేనత్త కొడుకు చేకూరి పల్లయ్య చౌదరి (52) కలిసి దోసకాయపల్లిలో బంధువుల ఇంటికి వివాహ కోసం వచ్చారు. గురువారం ఉదయం సత్యనారాయణమూర్తి దర్శనార్థం అన్నవరం వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డారు.

కోల్‌కతా నుంచి హనుమాన్ జంక్షన్‌కు డీఓపీ (చేపల మేత) లోడుతో వెళుతున్న లారీని మండలంలోని తాళ్లూరు శివారు కార్తికేయ రెస్టారెంట్ వద్ద డ్రైవర్ సుభాష్‌గోష్ భోజనం కోసం నిలిపాడు. లారీ నిలిపిన రెండు నిమిషాలకే మృతులు ప్రయాణిస్తున్న కారు వేగంగా వచ్చి లారీ వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టి అడుగు భాగంలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న సుబ్రహ్మణ్యం, పల్లయ్యచౌదరి అక్కడికక్కడే మృతిచెందారు. ఘటనా స్థలం వద్దకు చేరుకున్న గండేపల్లి ఎస్సై ఎన్.రామకృష్ణ తక్షణ సహాయక చర్యలు చేపట్టి క్రేన్ సహాయంతో లారీ వెనుక భాగంలో చిక్కుకున్న కారును బయటకు లాగి, కారు నుంచి మృతదేహాలను బయటకు తీయించారు. పోస్టుమార్టం కోసం పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు. రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది సతీష్, రోడ్డు మెయింటినెన్స్ సిబ్బంది ధన, తదితరులు ప్రమాదానికి గురైన కారును పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మృతులు ఇద్దరూ సమీప బంధువులు కావడంతో జగ్గంపేట మండలం సీతానగరం, దోసకాయపల్లి గ్రామాల నుంచి వచ్చిన బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడు సుబ్రహ్మణ్యం అత్తవారిది జగ్గంపేట మండలం సీతానగరం కావడంతో గతంలో ఇక్కడే ఉండేవారని, భార్య శ్వేత సమీపంలోగల దేవి ఫిషరీస్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగం చేసినట్టు బంధువులు తెలిపారు. ప్రస్తుతం భార్యాభర్తలిద్దరూ ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. హనుమాన్‌జంక్షన్ వద్ద ఇటీవల ఇల్లు కొనుగోలు చేసుకుని అక్కడే నివాసం ఉంటున్నారు. సుబ్రహ్మణ్యం తల్లి వరలక్ష్మి కొడుకు మృతదేహాన్ని, తన ఆడపడుచు కొడుకైన పల్లయ్య చౌదరి మృతదేహాలను చూసి షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నారు. మృతుడు సుబ్రహ్మణ్యంకు భార్య శ్వేత, కొడుకు సూర్య, కూతురు లలిత ఉన్నారు. మరో మృతుడు పల్లయ్య చౌదరి హైదరాబాద్‌లో వ్యాపారం చేస్తున్నాడు. భార్య వాణి, కూతురు మౌనిక, కొడుకు సాయి ఉన్నారు. మౌనిక అమెరికాలో ఉందని బంధువులు తెలిపారు.

నలుగురికి అవయవదానం

- రోడ్డు ప్రమాదంలో తలకు గాయం
- బ్రెయిన్ డెడ్ కావడంతో అవయవదానం



కొవ్వూరి రాణి

నల్లజర్ల: నా తనువు మట్టిలో కలిసిపోయినా.. అవయవదానంతో మరో కరిలో జీవిస్తా..నాలో ప్రతి అణువు అవసరమైన వారికి ఉపయోగపడాలి అంతే.. తల్లి మాటలను ఆమె మరణానంతరం ఆమె పిల్లలు తు.చ తప్పకుండా అమలు చేశారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడుకు చెందిన కొవ్వూరి రాణి(51)కి నాలుగురోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయం కాగా రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చేర్చారు. రెండురోజుల చికిత్స తర్వాత ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్టు డాక్టర్లు ధ్రువీకరించారు. రాణి కుమార్తె ఝాన్సీ ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రస్తుతం మధ్యప్రదేశ్ ఇండోర్‌లో పీజీ చేస్తోంది. రాణి కొడుకు అరుణకుమార్ రాజమహేంద్రవరంలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేశాడు. వీరిద్దరు వైద్యరంగంలో ఉండటంతో అవయవదానంపై అవగాహన ఉండి అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు. విశాఖ షీలానగర్‌లో ఉన్న కిమ్స్ ఆసుపత్రిలో మంగళవారం రాత్రి ఆమె ఊపిరితిత్తులను, మూత్రపిండాలను విశాఖలోని ఆసుపత్రులకు తరలించగా కాలేయం హైదరబాద్ తరలించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భర్త డేవిడ్ చిన్న రైతు. వైఎస్సార్ సీపీలో భార్యాభర్తలు ఇద్దరూ చురుగ్గా పనిచేస్తుంటారు. గురువారం ఆమె మృతదేహానికి పుల్లలపాడులో అంత్యక్రియలు జరిగాయి. రాణి కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకు రావడంతో పలువురు కొనియాడారు.

7న జిల్లా స్థాయి చెస్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడలోని రాయ్ చెస్ అకాడమీలో ఈనెల 7వ తేదీన అండర్–17 విభాగంలో జిల్లాస్థాయి బాలుర, బాలికల చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ ఇన్‌చార్జి ఎం.మనోహర్ గురువారం తెలిపారు. ఈ పోటీలకు 1–1–2007 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు.

రైతులు నూతన వంగడాలపై దృష్టి సారించాలి

ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తల సూచనలు

నల్లజర్ల: శాస్త్రవేత్తల సూచనల మేరకు కాలానుగుణంగా రైతులు వరి, చిరుధాన్యాలు, అపరాల నూతన వంగడాలపై దృష్టి సారించాలని రామహేంద్రవరం ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ డాక్టరు చల్లా వెంకట నరసింహరావు, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టరు అమ్మాజీ, డాక్టరు ఎస్.హైమజ్యోతి రైతులకు సూచించారు. గురువారం నల్లజర్లలో అభ్యుదయ రైతు నిమ్మలపూడి ప్రసాద్ పొలంలో పంటలను పరిశీలించారు. డాక్టరు నరసింహరావు మాట్లాడుతూ వచ్చే సార్వాలో వరిలో ఎంటీయూ 1271, 1293 వంటి రకాలను సాగు చేయాలన్నారు. ఈ ప్రాంతంలో చౌడుభూములు ఉన్నాయని దాళ్వా అనంతరం జీలుగ వంటి పచ్చిరొట్ట విత్తనాలు వేసుకొని సార్వాలో చౌడు తట్టుకునే 1293, ఎంసీయూ103 వంటి రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. డాక్టరు హైమజ్యోతి మాట్లాడుతూ రైతు నిమ్మలపూడి ప్రసాద్ క్షేత్రంలో రూపొందించిన వరి రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్ వీరితో ఉన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నిడదవోలు రూరల్: డి.ముప్పవరం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ గురువారం తెలిపారు. డి.ముప్పవరం గ్రామానికి చెందిన సోము అజయ్‌ను అరెస్ట్ చేసి మూడు ఫ/ల్ బాటిల్స్, 8 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనపర్చుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

యోగాలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన కార్తీక్



యోగాలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన కార్తీక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కర్రి కార్తీక్ రామచంద్రారెడ్డి యోగాలోని శలభాసన (చిన్ స్టాండ్) లాంగ్ టైం హోల్డింగ్ ఈవెంట్‌లో గిన్నిస్ వరల్డ్ సర్టిఫికెట్‌ను కలెక్టర్ కె.మాధవీలత చేతుల మీదుగా అందుకున్నాడని హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం గురువారం ప్రకటనలో తెలిపారు. చెన్నైలో ఇటీవల జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న దేశ ప్రధాని నరేంద్రమోదీ, ఇతర మంత్రుల సమక్షంలో యోగాలోని శలభాసన ఈవెంట్‌లో 321 మంది యోగా క్రీడాకారులు పాల్గొనగా 302 మంది విజయవంతంగా ఆసనాన్ని ప్రదర్శించి రికార్డును నెలకొల్పినట్లు గిన్నిస్ బుక్ అధికారులు ప్రకటించారన్నారు. ఈ ఈవెంట్‌కు విట్నెస్ అఫీషియల్‌గా నగరానికి చెందిన యోగా శిక్షకులు శ్రీధర్ రెడ్డి ఉన్నారని తెలిపారు. కార్తీక్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది అభినందించారని పేర్కొన్నారు.

న్యూట్రా స్యూటికల్స్, ఆహార ఉత్పత్తుల అభివృద్ధి



ఎంవోయూలతో శేషుమాధవ్, మూర్తి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్ఐ) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఆన్ కమర్షియల్ అగ్రికల్చర్ (ఎన్ఐఆర్‌సీఏ)గా ఆవిర్భవించిన తరువాత తమ పరిశోధనలను, ఆదేశాలను విస్తృత పరచుకొన్నామని సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. పొగాకుతో పాటు పసుపు, అశ్వగంధ, ఆముదం, మిరప వంటి వాణిజ్య పంటలలో విలువ ఆధారిత ఉత్పత్తులను అభివృద్ధి పరచడానికి సంస్థ, నూతన వ్యూహాలను అనుసరిస్తోందన్నారు. న్యూట్రా స్యూటికల్స్, పౌష్టికాహార ఉత్పత్తుల అభివృద్ధి దిశగా గురువారం సీటీఆర్ఐ, ఎన్ఐఆర్‌సీఏ పాలకొల్లులోని కలగా హెర్బల్ రీసెర్చ్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పసుపు, అశ్వగంధతో న్యూట్రా స్యూటికల్ ఫుడ్ సప్లిమెంట్స్‌ను అభివృద్ధి పరచడానికి ఒప్పందం చేసుకున్నాయి. ఎంవోయూపై శేషు మాధవ్, కలగా లాబ్స్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీఎస్ మూర్తి సంతకాలు చేశారు.

అదనపు కట్నం వేధింపులపై వివాహిత ఫిర్యాదు

ముమ్మిడివరం: అదనపు కట్నం తీసుకురమ్మని భర్త, అత్త, ఆడపడుచు, మరిది వేధింపులకు గురి చేస్తున్నారని ఒక మహిళ గురువారం ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినాపురం పడమటివారిపేటకు చెందిన సూజాతకు 2014లో పల్లంకుర్రుకు చెందిన మోకాళ్ల నాగేశ్వరరావుతో వివాహం అయింది. వివాహ సమయంలో పుట్టింటి వారు రెండు లక్షల కట్నం, లక్ష రూపాయల ఇతర లాంఛనాలు ఇచ్చారు. కొంతకాలం కాపురం సజావుగానే సాగింది. ఇటీవల అదనపు కట్నం తీసుకురమ్మని భర్త నాగేశ్వరరావు, అత్త సత్యవతి, మరిది భాస్కరరావు, ఆడ పడుచు నెల్లి మల్లీశ్వరి వేధింపులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు ముమ్మిడివరం హెచ్‌సీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాషన్

తెలుగింటి వెలుగులు

ఏ సంప్రదాయ వేడుకైనా అమ్మాయిలను ముందుగా ఆకట్టుకునేది లంగాఓణీ, గాగ్రాచోలీలు. తెలుగు సంవత్సరాది సందర్భంగా ఎంచుకోదగిన హాఫ్‌శారీ కలర్ కాంబినేషన్స్, తక్కువ ఖర్చుతో డిజైన్ చేసుకోవడం ఎలా .. అనే విషయాలపై అవగాహన ఎప్పుడూ అవసరం ఉంటూనే ఉంటుంది.



పండగల సమయంలో ముదురు, కాంతిమంతమైన రంగులున్నవి ఎంచుకుంటే కళగా కనిపిస్తుంది. పెళ్లిళ్లకు కూడా పై విధంగానే ఎంచుకోవాలి. పుట్టినరోజులు, రిసెప్షన్ వంటి వెస్టర్న్ టచ్ ఉన్న వేడుకలకు పేస్టల్ షేడ్స్ రిచ్‌గా ఉంటాయి.

డార్క్ కలర్స్ లెహంగా చోలీలు ధరించినప్పుడు గోల్డ్, టెంపుల్ జ్యూయలరీ బాగుంటుంది. పేస్టల్ కలర్స్‌కి డైమండ్స్, కుందన్, ముత్యాలను కూర్చిన ఆభరణాల అలంకరణ అందంగా ఉంటుంది.

పిల్లలు కూడా పండగలు, వివాహ వేడుకలలో ముదురు, కాంతిమంతమైన రంగులను ఇష్టపడుతున్నారు. పిల్లల డ్రెస్ డిజైన్స్‌లో కలర్స్, ఆభరణాల విషయంలో సింపుల్‌గా ఉంటేనే బాగుంటుంది.

హాఫ్ శారీస్ ఫ్యాబ్రిక్, ఎంబ్రాయిడరీ వర్క్‌ను బట్టి ఖర్చు పెరుగుతుంటుంది. గ్రాండ్ లుక్‌తోనూ కావాలనుకుంటే ఫ్యాబ్రిక్ ఎంపిక సరైనదిగా ఉండాలి. పెద్ద పెద్ద జరీ బార్డర్స్ ఉన్న మెటీరియల్‌ను ఎంచుకుంటే బాగుంటుంది. మగ్గం వర్క్స్ డిజైన్స్ బట్టి ఖర్చు పెరుగుతుంటుంది.

సంయుక్తారెడ్డి, ఫ్యాషన్ డిజైనర్, హైదరాబాద్

న్యూస్‌మేకర్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిహార్ నుంచి 25 ఏళ్ల శాంభవి చౌదరి ఎన్నికల్లో పోటీ చేయనుంది. దేశంలో అతి చిన్నవయసు మహిళా దళిత అభ్యర్థిగా శాంభవి వార్తల్లో నిలిచింది. రాజకీయ కుటుంబం నుంచి వచ్చినా తాను వేయదగ్గ ముద్ర... తనదైన దృష్టికోణం ఉన్నాయంటున్నది శాంభవి.

అతి చిన్న వయసు దళిత అభ్యర్థి

‘నేను పనిచేసే చోట స్త్రీలు, యువతే నా లక్ష్యం. వీరికి ఆర్థిక స్వావలంబన, ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తే అభివృద్ధి దానంతట అదే జరుగుతుంది’ అంటోంది శాంభవి చౌదరి. 25 ఏళ్ల 9 నెలల వయసు వున్న ఈ డాక్టరెట్ స్టూడెంట్ బిహార్‌లోని ‘సమస్తిపూర్’ పార్లమెంట్ స్థానం నుంచి లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) తరపున పోటీ చేయనుంది. ఇది రిజర్వ్‌డ్ స్థానం. బహుశా శాంభవి దేశంలోనే అత్యంత చిన్న వయసు కలిగిన దళిత మహిళా అభ్యర్థి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో. అందుకే అందరూ ఆమెవైపు ఆసక్తిగా చూస్తున్నారు.

రాజకీయ కుటుంబం నుంచి

ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి ఎం.ఎ. సోషియాలజీ చేసి ఇప్పుడు ‘బిహార్ రాజకీయాల్లో కులం, జెండర్ ప్రాధాన్యత’ అనే అంశం మీద పీహెచ్‌డీ చేస్తున్న శాంభవి రాజకీయ కుటుంబం నుంచి వచ్చింది. ఈమె తండ్రి అశోక్ కుమార్ చౌదరి జెడి (యు)లో మంత్రి. తాత మహదేవ్ చౌదరి కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా పని చేశారు. శాంభవి భర్త సాయన్ కునాల్ సామాజిక రంగంలో ఉన్నాడు. ఈమె మామగారు మాజీ ఐ.పి.ఎస్ అధికారి ఆచార్య కిశోర్ కునాల్ దళితుల కోసం చాలా పోరాటాలే చేశాడు. చాలా గుడులలో దళిత పురోహితులను ఆయన నియమించాడు. వీరందరి మధ్యలో చదువు మీద దృష్టి పెట్టి, పరిశోధన కొనసాగిస్తున్న శాంభవి ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లో దిగింది.



శాంభవి చౌదరి

నాకంటూ వ్యక్తిత్వం ఉంది

శాంభవి పోటీ చేస్తున్న లోక్ జనశక్తి పార్టీ ఎన్‌డిఏ కూటమిలో ఉంది. బిజెపి కుటుంబ వారసత్వం గురించి అభ్యంతరం చెప్పడం తెలిసిందే. ‘మీ నాన్నగారు మంత్రి. మరి మీకు సీటిచ్చారు’ అనే ప్రశ్నకు ‘నిజమే. కాని నాకు సీటు రావడంలో ఆయన ప్రమేయం మాత్రం లేదు. చిన్నప్పటి నుంచి నేను మా తాత, నాన్న పేదవాళ్ల సమస్యలు వింటూ వారి కోసం పనిచేయడం చూస్తూ పెరిగాను. అది నామీద ఎక్కడో ప్రభావం చూపింది. దళితుల్లో పుట్టి పెరిగిన వ్యక్తిగా, చదువుకున్న మహిళగా దళితుల పట్ల నాకు అవగాహన ఉంది. రాజకీయ కుటుంబం నుంచి రావడం వల్ల ప్రజలను ఎలా అర్థం చేసుకోవాలో తెలుసు. ఎలక్షన్లు సమీపించేవరకూ నేను నిలబడాలని అనుకోలేదు. కాని సమీపించాక లోక్ జనశక్తి చీఫ్ చిరాగ్ పాశ్వాన్‌తో చెప్పాను. ఆయన నా భర్తను సొంత తమ్ముడిలా చూస్తారు. అంతేకాదు, బిహార్ రాజకీయాలలో యువత రాణించాలని భావిస్తారు. నాకు అన్ని అర్హతలు ఉన్నాయన్న కారణం రీత్యానే సీట్ ఇచ్చారు’ అని తెలిపిందామె.

అత్తగారి ఊరు


పట్నాలో పుట్టి పెరిగిన శాంభవి తన అత్తగారి ఊరైన సమస్తిపూర్‌లో గెలవడానికి సిద్ధమవుతోంది. ‘ఆ ఊరి గురించి నిజం చెప్పాలంటే నాకేమీ తెలియదు. ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను. మొదట అక్కడ ఒక ఇల్లు కొని అక్కడే ఉంటానన్న భరోసా కల్పించాలి. ఆ ఊరి యువతతో ఇప్పటికే కాంటాక్ట్‌లోకి వెళ్లాను. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని గెలిపిస్తారు. అవి వమ్ము చేయకుండా ఉండటమే నా ప్రథమ లక్ష్యం’ అంటున్న శాంభవి రాజకీయ జీవితాన్ని త్వరలో ఓటర్లు నిర్ణయిస్తారు.

ఉగాది వంటిల్లు



ఉగాది వస్తోంది... క్రోధి నామంతో కొత్త ఏడాదిని తెస్తోంది. కొత్తబెల్లంతో ఉగాది పచ్చడి ఎలాగూ కలుపుకుంటాం. పండుగ రోజు పచ్చడి తర్వాత ఇంకా ఏమేమి తిందాం. కొబ్బరి పాల గారెలు... మజ్జిగ వడలు చేసుకుందాం. మరికొంత సులువుగా ఓట్స్ స్మూతీ కూడా చేసుకుందాం.

ఉగాది పచ్చడి



కావలసినవి: మామిడి పిందె – ఒకటి; వేప పువ్వు – టేబుల్ స్పూన్; బెల్లం పొడి– టేబుల్ స్పూన్; చింతకాయ – ఒకటి (లేకపోతే కొత్త చింతపండు చిన్న గోళీ అంత); ఉప్పు – చిటికెడు; పచ్చిమిర్చి – ఒకటి (తరగాలి).

తయారీ: ● వేప పువ్వును తొడిమలు, ఈనెలూ తీసేసి శుభ్రంగా కడిగి పక్కన పెట్టాలి ●చింతపండును నీటిలో నానబెట్టి రసం తీసుకోవాలి ● మామిడికాయను శుభ్రంగా కడిగి తొక్క తీయకుండా సన్నగా తరగాలి ● ఒక పాత్రలో బెల్లం పొడి, చింతపండు రసం, మామిడికాయ ముక్కలు, వేపపువ్వు, పచ్చిమిర్చి ముక్కలు, ఉప్పు వేసి కలిపితే ఉగాది పచ్చడి రెడీ. గమనిక: ఇష్టమైతే చెరుకు ముక్కలు, రుచి కోసం అరటిపండు గుజ్జు కలుపుకోవచ్చు.

ఓట్స్ స్వీట్ స్మూతీ



కావలసినవి
ప్లెయిన్ సఫోలా ఓట్స్ – అరకప్పు; అరటిపండు – 1; బాదం పాలు – అరకప్పు; నీరు – అర కప్పు; చక్కెర – పావు కప్పు.

తయారీ: ఓట్స్‌ని మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. ఒక పాత్రలో బాదం పాలు, నీరు, అరటి పండు గుజ్జు, చక్కెర, ఓట్స్ పొడి వేసి బీటర్‌తో కలిపితే స్మూతీ రెడీ. గ్లాసులో పోసుకుని తాగడానికి వీల్లేనంత చిక్కగా ఉంటే మరికొంత నీటిని చేర్చుకోవచ్చు. స్మూతీని చల్లగా తాగాలనుకుంటే అరగంట సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి లేదా స్మూతీ కోసం వాడే నీటిని ముందుగా ఫ్రిజ్‌లో పెట్టి చల్లబరుచుకోవాలి. బాదం పాలు రెడీమేడ్‌వి తీసుకోవచ్చు లేదా బాదం పప్పులు– నీటిని కలిపి మిక్సీ వేసి పాలను తయారు చేసుకోవాలి. ఇందులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.

పాల గారెలు



కావలసినవి: మినప్పప్పు – పావు కేజీ; నూనె – వడలు వేయించడానికి తగినంత; కొబ్బరిపాలు – లీటరు; యాలకుల పొడి– అర టీ స్పూన్; ఉప్పు– చిటికెడు; బాదం పప్పు – 10 (నానబెట్టి పొట్టు తీసి తరగాలి); జీడిపప్పు – 20; కిస్‌మిస్– టేబుల్ స్పూన్; పిస్తా– టేబుల్ స్పూన్; నెయ్యి– టేబుల్ స్పూన్; బెల్లం లేదా చక్కెర – అర కేజీ.

తయారీ: ● మినప్పప్పును శుభ్రంగా కడిగి నాలుగు గంటల సేపు మంచినీటిలో నానబెట్టిన తర్వాత మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పప్పును ఒక గిన్నెలోకి తీసుకుని బీటర్ లేదా స్పూన్‌తో రెండు నిమిషాల పాటు చిలకాలి. ● స్టవ్ మీద అడుగు మందంగా ఉన్న పాత్రను పెట్టి కొబ్బరి పాలు పోసి మరిగించాలి. వేడెక్కుతున్నప్పుడు అందులో చక్కెర వేసి కలుపుతూ మరిగించాలి. చిక్కబడేటప్పుడు యాలకుల పొడి వేసి మరో నిమిషం పాటు మరిగించి దించేయాలి. ● ఇప్పుడు స్టవ్ మీద చిన్న బాణలి పెట్టి నెయ్యి వేడి చేసి అందులో బాదం, పిస్తా, జీడిపప్పు, కిస్‌మిస్ వేయించి కొబ్బరి పాలు బెల్లం మిశ్రమంలో కలపాలి ● బాణలిలో నూనె వేడి చేసి అందులో మినపపిండిని పాలిథిన్ పేపర్ మీద వేసి వత్తి (నిమ్మకాయంత గోళీలుగా కూడా వేసుకోవచ్చు) నూనెలో వేయాలి. రెండువైపులా కాలనిచ్చి తీసి టిష్యూపేపర్ మీద వేయాలి. అదనంగా ఉన్న నూనెను పేపర్ పీల్చుకున్న వెంటనే (వేడిగా ఉండగానే) వడలను ఒక వెడల్పు పాత్రలో పరిచినట్లు అమర్చి కొబ్బరిపాల మిశ్రమాన్ని పోయాలి. వడలు ఐదు నిమిషాల్లో కొబ్బరి పాలను పీల్చుకుంటాయి. వడలు పీల్చుకున్న తర్వాత కూడా పాలు ఇంకా మిగులుగా ఉండాలి. సర్వ్ చేసేటప్పుడు కప్పులో ఒక వడ ఒక గరిటె కొబ్బరి పాలు వేసి ఇవ్వాలి.

మజ్జిగ వడ



కావలసినవి: అటుకులు – కప్పు; రవ్వ – పావు కప్పు; మజ్జిగ– అర కప్పు; పచ్చిమిర్చి – 2 (తరగాలి); అల్లం తరుగు – టేబుల్ స్పూన్; నువ్వులు – టీ స్పూన్; కరివేపాకు – రెండు రెమ్మలు (తరగాలి); కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్; జీలకర్ర – అర టీ స్పూన్; బియ్యప్పిండి లేదా ఓట్స్ – టేబుల్ స్పూన్; ఉల్లిపాయ తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; కొబ్బరి తురుము – టేబుల్ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పచ్చి శనగపప్పు– టేబుల్ స్పూన్; నూనె– వేయించడానికి తగినంత.

తయారీ: ● అటుకులను వెడల్పు పాత్రలో వేసి నీటిని పోసి కడిగి వేరొక పాత్రలోకి తీసుకోవాలి. అటుకులను నీటి నుంచి వేరు చేయడానికి నీటిని వంపకూడదు. నీటిలో తేలుతున్న అటుకులను చేత్తో తీసి మరొక పాత్రలో వేసుకోవాలి. ఇలా చేయడం వల్ల అటుకుల్లో ఇసుక ఉంటే నీటి అడుగుకు వెళ్లిపోతుంది. అటుకులు శుభ్రంగా ఉంటాయి. ● పచ్చి శనగపప్పు కడిగి అటుకుల్లో వేయాలి. ● అందులో రవ్వ, ఉప్పు, మజ్జిగ వేసి కలిపి ఇరవై నిమిషాల సేపు నాననివ్వాలి. ● ఇప్పుడు నానిన అటుకుల్లో అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, నువ్వులు, కరివేపాకు, కొత్తిమీర, కొబ్బరి తురుము, నువ్వులు, బియ్యప్పిండి వేసి కలిపి పది నిమిషాల సేపు ఉంచాలి. ● ఇప్పుడు మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుని వడకు సరిపోయేటట్లు ఉందా లేదా అని సరి చూసుకోవాలి. మరీ జారుడుగా ఉంటే మరికొంత బియ్యప్పిండి కలుపుకుని పిండి అంతటినీ పెద్ద నిమ్మకాయంత గోళీలు చేసి పక్కన పెట్టాలి. ● బాణలిలో నూనె వేడి చేసి అటుకుల గోళీని వత్తి మధ్యలో చిల్లు పెట్టి నూనెలో వేసి రెండు వైపులా ఎర్రగా కాల్చి తీయాలి. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి. వేడి వేడి వడల్లోకి పుదీనా చట్నీ రుచిగా ఉంటుంది.